క్లుప్తంగా

పాదయాత్రకు సంఘీభావం



ఏపీ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు బసవరాజుకు స్వాగతం పలుకుతున్న నేతలు

కోడుమూరు: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వచ్చే ఎన్నికలలో 175 స్థానాలకు 175 గెలుపొందాలని కోరుతూ ఏపీ మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు ఇడుపులపాయ నుంచి ఇచ్చాపురం వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం కర్నూలు మండలంలోని దిన్నెదేవరపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా కోడుమూరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దయ్య పాదయాత్రకు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. వారికి విడిది ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్, ధనుంజయ, లక్ష్మీకాంతయ్య, జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒండుట్లలో 'గడప గడపకు'

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకుంటారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో భాగంగా ఏర్పడిన భూ సమస్యలపై తహసీల్దార్ శేషఫణికి అర్జీలు ఇచ్చారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు సమస్యలను, మురుగనీరు, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఏఓ మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైకేపీ ఏపీఎం బదిలీ

గూడూరు: మండల వైకేపీ ఏపీఎంగా పనిచేస్తున్న సుధాకర్‌ను జిల్లా అధికారులు కర్నూలు డీపీఎంకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు డీపీఎంలో పనిచేస్తున్న చక్రధరుడును నియమించారు. ఈ మేరకు సోమవారం చక్రధరుడు స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

సీఈఎస్‌లో ఫార్మసీ ఇండక్షన్ ప్రోగ్రాం

కల్లూరు: చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మ్‌-డి, బిఫార్మసీ కోర్సులపై ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శివశంకర్‌రెడ్డి హాజరయ్యారు. ప్రిన్సిపాల్ పి.రవి ప్రకాష్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

కర్నూలు(అగ్రికల్చర్): దేశీ డిప్లొమ కోర్సు పూర్తి చేసిన ఇన్‌పుట్ డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన ఇన్‌పుట్ డీలర్లకు సోమవారం ఆమె సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, దేశీ కార్యక్రమ సమన్వయకర్తలు నాగేంద్రయ్య, జయచంద్ర, రిటైర్డ్ డీడీఏ భగవత్‌స్వరూప్, ఆత్మ ఏవో మధుమతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



రాష్ట్ర జట్టుకు కప్ అందిస్తున్న నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్) : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. రెండు రోజుల పాటు స్థానిక దేవీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల కరాటే చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఇందులో రాష్ట్ర జట్టు విజేతగా నిలవగా తెలంగాణ జట్టు రన్నర్ స్థానంలో నిలిచింది. ఆయా జట్లకు నగర మేయర్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి కోలా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కాన్పు..ఆసుపత్రే సేఫ్

- పెరిగిన అవగాహన.. ఇళ్ల వద్ద తగ్గిన కాన్పులు
- మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- కాన్పులకు ఆరోగ్యశ్రీ వర్తింపు
- వంద శాతం ఆసుపత్రుల్లోనే జరుగుతున్న ప్రసవాలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగం

కర్నూలు(హాస్పిటల్): పాతిక, ముప్పై ఏళ్ల క్రితం పురిటినొప్పులు వస్తే ఆసుపత్రికి వెళ్లే వారు ఏ కొద్దిమందో. కానీ ఇప్పుడు పురిటినొప్పులు అలా మొదలవగానే ఆసుపత్రికి వెళ్తున్నారు. కొందరు మూడు రోజులు ముందుగానే వెళ్తున్నారు. ప్రజల్లో పెరిగిన అవగాహనతో పాటు వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ వర్తింపజేస్తుండటం ఈ మార్పునకు కారణమైంది. ప్రస్తుతం వంద శాతం కాన్పులు ఆసుపత్రుల్లోనే జరుగుతుండటంతో మాతాశిశు మరణాలు సైతం తగ్గుముఖం పడుతున్నాయి.

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి, ఆదోని ఎంసీహెచ్‌తో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీల్లోనూ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవే గాక గుర్తింపు పొందిన జిల్లాలో 60కి పైగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ కాన్పులు చేస్తున్నారు. వీటిలో కొన్నింటికి డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ సౌకర్యం ఉండటంతో గర్భిణులు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రసవాలు చేయించుకుంటున్నారు. ఆసుపత్రి ప్రసవాలు పెరగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటు ప్రైవేటు ఆసుపత్రులతో పాటు అటు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సౌకర్యం ఏర్పాటు చేసింది. దీంతో ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఇంటి వద్ద కాన్పులు చేయించుకునే వారు సైతం ఇప్పుడు ఆసుపత్రులకు వస్తున్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలకే మొగ్గు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019–20 సంవత్సరంలో 64,143 మంది ప్రసవించగా అందులో 99.49 శాతం ఆసుపత్రిలోనే ప్రసవించారు. అలాగే 2020–21లో 78,960 మంది ప్రసవించగా 99.47శాతం, 2021–22లో 43,637 (కర్నూలు జిల్లా మాత్రమే) మంది ప్రసవించగా 99.90శాతం మంది, 2022–23లో 33,333 మంది ప్రసవించగా వందశాతం, 2023–24లో గత సెప్టెంబర్ వరకు 23,860 మంది ప్రసవించగా అందరూ ఆసుపత్రుల్లోనే కాన్పు అయ్యారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 13,183 మంది, ప్రైవేటు ఆసుపత్రుల్లో 10,677 మంది ప్రసవించారు.

ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే...!

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలు అధిక శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. నిపుణులైన వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉండటం, నిరంతరం పర్యవేక్షణ ఉంటుందనే ఉద్దేశంతో పాటు ఆసుపత్రిలో ప్రసవం అయితే రూపాయి ఖర్చు ఉండకపోవడంతో పాటు రూ.6 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ప్రతిరోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతుండగా ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో 10 నుంచి 20 దాకా ప్రసవాలు జరుగుతున్నాయి. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో అక్కడి వైద్యసిబ్బంది ఆధారంగా ప్రతిరోజు ఒకటి నుంచి 5 మంది ప్రసవిస్తున్నారు. ఈ యేడాది జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు 15,150 ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగాయి.

ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం



ఇంటి వద్ద ప్రసవం చేయించుకుంటే ప్రాణం మీదకు వచ్చే అవకాశాలే ఎక్కువ. అదే ఆసుపత్రుల్లో అయితే డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుంది. కాబట్టి గర్భిణులు అవసరమైతే రెండు, మూడు రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలి. గర్భిణి ఇంటి నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జ్ అనంతరం ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఉంటుంది. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

ఉద్యోగం పేరుతో మోసం

- స్పందనలో ఏఎస్పీకి బాధితుల ఫిర్యాదు

కర్నూలు : నందికొట్కూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5 లక్షలు తీసుకుని కర్నూలు ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రసాదరావు మోసం చేశాడని, సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని గుంతకల్లు పట్టణానికి చెందిన ఎర్రిసామి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్‌కు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 60 ఫిర్యాదులు రాగా వాటిని పరిశీలించి చట్ట పరిధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని..

- రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీలో నా భర్తకు అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తామని ఏసు అనే వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని, విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- తాను బీఈడీ చదువుకున్న నిరుద్యోగినని, డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న తరుణంలో ప్రవీణ్, నాగన్న అనే వ్యక్తులు తనకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.లక్ష తీసుకుని మోసం చేశారని కర్నూలు బుధవారపేటకు చెందిన ఎస్.నారాయణ ఫిర్యాదు చేశారు.
- నగర శివారులోని వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలో ఉన్న శ్రీసాయి వెంచర్‌లో అక్రమంగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొంతమంది గుడిసెలు వేసుకుని దౌర్జన్యం చేస్తున్నారని కర్నూలుకు చెందిన చిన్న మాధవస్వామి, నాగరాజు, గోపాల్ ఫిర్యాదు చేశారు.
- నగర శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న 4.85 ఎకరాల భూమిని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ జేసీబీతో క్లీన్ చేసి ఆక్రమించుకోవడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు శ్రీనగర్‌కు చెందిన రవికుమార్ ఫిర్యాదు చేశారు.



స్పందనలో ఏఎస్పీకి సమస్యలు చెప్పకుంటున్న బాధితులు

భగవద్గీత పఠన పోటీల్లో ప్రతిభ

కర్నూలు సిటీ: కర్నూలు చిన్మయ మిషన్, చిన్మయ సేవా ట్రస్ట్ (హైదరాబాదు) ఇటీవల నిర్వహించిన భగవద్గీత జిల్లా స్థాయి పఠన పోటీల్లో విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు బి. పాల్గొని ప్రతిభ కనబరిచారు. 9వతరగతి చదువుతున్న బి. నిత్యశ్రీ హర్షిణి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా ఐదవ తరగతి చదువుతున్న కె.సాయి రేష్మంత్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ ఇద్దరిని సోమవారం మాంటిస్సోరి స్కూల్ హెచ్‌ఎం కె. స్వర్ణలత, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. భగవద్గీత పఠనం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు నైతిక విలువలు పెరుగుతాయని హెచ్‌ఎం తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న మాంటిస్సోరి స్కూల్ హెచ్‌ఎం స్వర్ణలత

'ప్రత్యేక ఓటరు నమోదు'కు విశేష స్పందన

- కోడుమూరు నియోజకవర్గంలో 1,769 దరఖాస్తులు
- కొత్తగా ఓటరు నమోదుకు 1,096 మంది అభ్యర్థన
- మొత్తం ఓటర్లు 2,31,940 మంది

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మొత్తం 1,769 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గుడూరు, సి.బెళగల్, కర్నూలు అర్బన్, రూరల్, కోడుమూరు మండలాల పరిధిలో ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 2,31,940 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,16,770, మహిళలు 1,15,157, ఇతరులు 13 మంది ఉన్నారు. ఈ జాబితాలోని ఓటర్లపై ఏవైన అభ్యంతరాలు ఉంటే తెలిపేందుకు గత నెలలో రెండు రోజుల సమయం ఇచ్చారు. మరోసారి శని, ఆదివారాల్లో ప్రత్యేక సదస్సులు కూడా నిర్వహించారు. నియోజకవర్గంలో 275 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి అర్హులైన వారికి కొత్తగా ఓటరుగాను(ఫారం–6), నాన్‌–రెసిడెంట్ ఇండియన్స్(ఎన్‌ఆర్‌ఐలు) (ఫారం–6ఏ) నుంచి, ఎలక్ట్రోరల్ రోల్‌లో ఓటరు ఏదైన సమాచారంలో మార్పులు చేసేందుకు (ఫారం–7), దరఖాస్తుదారు(ఓటరు)పేరు, ఫోటో, వయసు, ఈపీఐసీ నంబరు, చిరునామా, పుట్టిన తేది, లింగంలో మార్పులు చేసేందుకు(ఫారం–8) పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ఫారాలను పూరించారు. దీంతో పాటు 18 సంవత్సరాల వయస్సు ఉండి ఓటరుగా నమోదు చేసుకోని వారికి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు.

275 పోలింగ్ స్టేషన్లు..

రెండు రోజుల పాటు 275 పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌ఓలకు గత నెలలో ఫారం–6 దరఖాస్తులు 950, ఫారం–6ఏ 89, ఫారం–8 దరఖాస్తులు 149 వచ్చాయి. శని, ఆది వారాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపులో ఫారం–6 దరఖాస్తులు 1096 (ఇందులో కర్నూలు మండలంలో 234, కోడుమూరు 317, గూడురు 295, సి.బెళగల్ 250), ఫారం–6ఏ జీరో, ఫారం–6బీ జీరో, ఫారం–7 దరఖాస్తులు 232(కర్నూలు మండలంలో 30, కోడుమూరు 59, గూడురు 99, సి.బెళగల్ 44), ఫారం–8 దరఖాస్తులు 441 (కర్నూలు మండలంలో 75, కోడుమూరు 213, గూడురు 79, సి.బెళగల్ 74) వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ఓర్వకల్లు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోని వారిని గుర్తించి.. అర్హత గల వారందరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఇంటింటికీ వెళ్లి ఓటు హక్కులేని వారిని గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో ఫారమ్‌–6 కింద 770 మంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మార్చుకొనుటకు ఫారం–7 కింద 240 మంది, తప్పుడు పేర్లు, అడ్రస్ మార్పు, ఫోటోలు సరిగా లేని వారు ఫారమ్‌–8 కింద దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. వచ్చిన దరఖాస్తులను క్షున్నంగా పరిశీలించి కొత్త ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 7వ తేదీలోగా కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.



ఓర్వకల్లులో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌ఓ కృష్ణదేవరాయులు

కంప్యూటర్ స్కిల్స్‌పై శిక్షణ

కర్నూలు సిటీ: కేవీఆర్ బాలికల జూనియర్ కాలేజీకి చెందిన జూనియర్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సు విద్యార్థులకు నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కంప్యూటర్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డా.రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు సాంకేతిక అంశాల్లో విద్యార్థులకు నైపుణ్యం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరంలో కార్తీక సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. కార్తీకమాసం, మూడవ సోమవారం కావడంతో వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అభిషేక ప్రియుడైన ఈశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి ప్రారంభమైన భక్తుల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ఆలయప్రధాన అర్చకులు శ్యాంసుందరశర్మ భక్తులకు వివరించారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులకు కాశీరెడ్డినాయన ఆశ్రమం, ఆర్య వైశ్య సంఘం, వీరశైవుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.



భోగేశ్వరాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చికెన్‌షాపు యజమానుల కడుపు కొట్టొద్దు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు, చికెన్ షాపుల యజమానులు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు టెండర్లు పిలిచి వ్యర్థ పదార్థాలను టెండర్ పాడుకున్న వ్యక్తికి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసి చికెన్‌షాపు యజమానుల కడుపు కొట్టొద్దని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని చికెన్‌షాపుల యజమానులు, సీపీఐ నేతలు కలిసి అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా చికెన్‌షాపు యజమానులు వ్యాపారాలు చేసుకుంటూ ఆస్తి, చెత్త పన్నులు కడుతూ చట్టబద్ధంగా షాపులు నిర్వహిస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు షాపుల యజమానులతో మాట్లాడకుండా వారి సాధకబాధలు అర్థం చేసుకోకుండా చికెన్ వేస్టేజీకి సంబంధించి టెండర్లు పిలిచి కడుపుకొట్టొద్దని కోరారు. చికెన్ వేస్టేజీ కోసం ఇచ్చిన టెండర్లను రద్దు చేయాలని నగరంలోని చికెన్‌షాపు యజమానులతో కలిసి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చికెన్ షాపుల యజమానులు మల్లికార్జున, రాజు, రవి, వీరేష్, ఖాదర్, రఫీ, సీపీఐ నగర నాయకులు నాగరాజు, మహేష్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల ఆర్థికాభివృద్ధి

కల్లూరు: పేదల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని కల్లూరు అర్బన్ క్లస్టర్‌–2 అధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిచారన్నారు. అర్హులైన వారందరికి పార్టీలకు, రాజకీయాలకు, వర్గాలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధురి, నరసింహులు, నాయకులు కృష్ణమూర్తి, మిద్దూరు శ్రీనివాసులు, సంగమేశ్వరావు, హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో

కల్లూరు అర్బన్ పరిధిలోని 20వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు అర్బన్ క్లస్టర్‌–1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనకు తేడా గమనించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



గొందిపర్లలో వలంటీర్లకు కిట్లను అందజేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్

ప్రజల చెంతకే ప్రజాప్రతినిధులు

కర్నూలు సిటీ: దేశంలో ఎక్కడ కూడా ప్రజల చెంతకే ప్రజాప్రతినిధులను పంపించాలని ఆలోచించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం గొందిపర్ల గ్రామ పంచాయతీ సచివాలయం–1లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అనే కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ నెహిమియా పాల్గొని ప్రసంగించారు. అనంతరం సర్వే కిట్లను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపాల్, భరత్ రెడ్డి, సూర్య చంద్రారెడ్డి, ఎండీ గౌస్, సుధాకర్, రాజశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలన

ఓర్వకల్లు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అవినీతిరహిత పాలన అందిస్తున్నారని ఎంపీపీ తిప్పన్న అన్నారు. మండలంలోని నన్నూరు సమీపంలో గల రాగమయూరీ గ్రీన్ హిల్స్‌లో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు రావాలి' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ తిప్పన్నతో పాటు, సర్పంచు బ్రహ్మయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాళ్లు ఫాతిమాబీ, కుసుమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గఫార్, కృష్ణ పాల్గొన్నారు.



నన్నూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. వర్సిటీ భూములపై ఓ పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్సిటీ భూముల్లో కొంత స్థలాన్ని పర్యాటక రంగం అభివృద్ధికి కేటాయిస్తున్నారన్న విషయంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. 2023 సంవత్సరానికి యూనివర్సిటీ భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొంత నిధులను మంజూరు చేసిందన్నారు. మిగతా నిధులను వచ్చే వార్షిక బడ్జెట్‌లో కేటాయించనుందన్నారు. యూనివర్సిటీ ప్రాంగణాల్లో గ్రీనరి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసిందని, ఇందులో భాగంగానే అధికారులు తమను సంప్రదించారే తప్ప మరో ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 144 ఎకరాల భూమి యూనివర్సిటీ ఆధీనంలోనే ఉందని, దీనిపై ఎవరూ అనుమానాలు, సందేహాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

8న కాల్వబుగ్గలో లక్ష దీపోత్సవం

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 8న లక్ష దీపోత్సవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. కార్తీక మాసం, మూడో శుక్రవారం సందర్భంగా బుగ్గరామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వాక ఏకాదశ రుద్రాభిషేకాలు, 7 గంటలకు స్వామి అమ్మవార్లకు కుంకుమార్చనలు, సహస్రనామావళి పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటలకు కార్తీక లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రి 7 గంటలకు ఉచిత ప్రసాద వితరణ చేపడతామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పాదుపు మహిళలు తప్పక హాజరుకావాలని ఆలయ అర్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ కోరారు.

భూ రీసర్వేలో లోపాలను సరిచేయాలి

కల్లూరు: భూ రిసర్వేలో లోపాలను సరి చేసిన తర్వాతనే హద్దు రాళ్లను పాతాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కె.మార్కాపురం గ్రామానికి చెందిన రైతులతో కలసి తహసీల్దార్ టీవీ రమేష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు, పాస్‌బుక్‌లలో ఉన్న ప్రకారం కాకుండా పొలం విస్తీర్ణంలో తేడా వస్తుందన్నారు.

10న భట్టురాజు సంక్షేమ సంఘం వనభోజనాలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 10వ తేదీన భట్టురాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమాలను స్థానిక కోడుమూరు రోడ్డులోని నెరవాడ శ్రీ దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర నాయకులు కూడా హాజరవుతున్నారని, భట్రాజు కుల వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేశామన్నారు. అవివాహితులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా పరమశివునికి రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, ఉసిరి చెట్టుకు పూజ, 2024 క్యాలెండర్ ఆవిష్కరణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని రైల్వే గేటు కాసేపు మొరాయించింది. సోమవారం సాయంత్రం గూడ్స్ రైలు వెళ్లిన తర్వాత ఒక గేటు తెరుచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే టెక్నికల్ అధికారులు వచ్చి గేటుకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు.

భూ హక్కుల చట్టం రద్దు చేయాలి

కర్నూలు (లీగల్) : నూతన భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు విధులను బహిష్కరించి స్థానిక న్యాయవాద సంఘం కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు.